






"హలో"

"నేనండీ ఆనందరావుని."

"అహా! నమస్కారమండీ ఏమిటీ సంగతి?"

"మూర్తిగారున్నారాండీ? చాలా అర్జంటుపని. మా యింట్లో దొంగలు పడ్డారు. నాకేం తోచకుండావుంది. ఆయన్ని కొంచెం తొందరగా రమ్మనాలి."

"అయ్యయ్యో. వెరీ సారీ. యెలా జరిగింది. ఏం పోయిందీ?"

"చాలా పోయింది. మాదికూడా కాదు. మాయింటికో గెస్టు వచ్చారు మొన్న. ఆయన పెట్టెలోనుండినాల్గువేల రూపాయలు పోయాయి. ఆయన ఆగ్రా వెళ్ళారు. సాయంత్రానికల్లా వస్తారు. నాకు చాలా గాభరాగా వుంది. మూర్తిగార్ని తొందరగా రమ్మనమనండి."

"అలాగే. అలాగే తప్పకుండాను."

"దిన్నా నాన్నగారు వస్తున్నట్టున్నారు చూడూ. కారు చప్పుడు వినిపిస్తోంది. కారు బయటే వుంచమను. అంకుల్ వాళ్ళింటికి వెళ్ళాలి. దొంగలు పడ్డారుట పాపం."

"ఎవరింట్లో మమ్మీ, యేం దొంగలు?"

"ఏం దొంగలేమిట్రా నీ మొహం" అంకుల్ వాళ్ళింట్లో 'చోరీ' అయిందిట. (పాపం ఈ ఢిల్లీ పిల్లలకి తెలుగు తొందరగా అర్థంకాదు. ఇంగ్లీషు. తెలుగు. హిందీ అన్నీ కలపాలి. అప్పుడే వాళ్ళకి అర్థం అవుతుంది.)

"సునో నువ్వు జల్దీ జల్దీ కృష్ణగారింటికి వెళ్ళి అంకుల్ని ఆంటీని (అందర్నీ అంకులే అంటారు. యెందుకంటె చాకలి స్కూటరు మీద వసాడు. సోఫాలో కూచుంటాడు. అతణ్ణి ధోబీ అంకులొచ్చాడంటారు పిల్లలు) తొందరగా రమ్మని చెప్పు. ఆనందరావుగారింట్లో దొంగలు పడ్డారుట మమ్మీ, డాడీ కార్లో వెళ్తున్నారుట మిమ్మల్నికూడా రమ్మన్నారని చెప్పు"

కారంటేగాని వాళ్ళు రారు లేకపోతే "అబ్బ యెండండీ, చెమటలు, నీరసం, బస్సుల్లోపడి వెళ్ళటం యెంత కష్టం" అంటారు. కృష్ణగారేమో జర్నలిష్టు. ఎన్నో ఇన్విటేషన్లు వస్తాయి. డ్రామాలనీ, డాన్సులనీ, కచేరీలనీనూ. 'పేపర్లో రాస్తారు గదా' తనని గురించి అని ప్రత్యేకంగా ఇంటికివచ్చిలా పిలుస్తారు. "అమ్మా మీరు కూడా తప్పక దయచేయాలి" అని ఆవిణ్నీ పిలుస్తారు. ఆవిణ్ని పిలవకపోతే ఆయన్నీ వెళ్ళనివ్వదు. అప్పటికీ ఆవిడకి చిరాకే. "ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులివ్వకపోతే మన కెందుకండీ ఈ ఆముదం. ఈ ఢిల్లీలో కాస్తా కూస్తా దూరాలా! వాళ్ళని గురించి తేరగా పేపర్లో పడాలంటె ఆ మాత్రం డబ్బు ఖర్చు చెయ్యొద్దూ" అని దెబ్బలాడుతుంది. నిజమేగదా పాపం!

కృష్ణగారు వాళ్ళు వెళ్ళేప్పటికి వాళ్ళూ రెడీగా వున్నారు.

"వాంగో వాంగో సార్."

"వణక్కం యెన్నా విశేషం - మీ గోడుగు (కొడుకులు)లేం చేస్తున్నారు?"

"నల్లగా (బాగా) వున్నారు."

ఇద్దరికీ అరవం సరిగ్గా రాదు. సరదాకి మాట్లాడుకుంటూ వుంటారు. యెందుకంటె యిక్కడి అరవ్వాళ్ళు. అవతలివాడికి తమ భాష వచ్చా రాదా అని చూడకుండా ఆపకుండా అరవంలో వాయగొడుతుంటారు. పాపం వీళ్ళు తెల్ల మొహాలేసుకుని ఆఖరికి "మేం తెలుగువాళ్ళమండీ" అంటారు.

వీళ్ళు వాళ్ళు కలిసి ఆనందరావుగారింటికి వెళ్ళేటప్పటికి వాకిలినిండా జనం. పోలీసులు. కుక్కలు అంతా చాలా హడావిడిగా వుంది.

కుక్కల్ని చూడగానే కృష్ణగారి భార్య కార్లోంచి దిగనంది. కుక్కలంటే ఆవిడకి చాలా భయం. మూర్తిగారింట్లో కూడా కుక్క వుంది. ఆవిడ గాభరా చూసి అదెప్పుడూ ఆవిడ వెంటే పడుతుంటుంది.

"అయ్యో రామా. ఇవి దొంగల్ని పట్టుకునే కుక్కలండీ మనజోలికిరావు. రండీ. రండి" అని బలవంతాన లోపలికి తీసుకెళ్ళారు.

ఆనందరావుగారు చాలా డీలాపడిపోయారు. ఫాను క్రింద నుంచోని కూడా చెమటలు కారిపోతున్నారు.

"పోలీసు లేమంటున్నారు?"

"ఏమిటో అన్నీ తలతిరుగుడు ప్రశ్నలు. నాకసలే బ్లడ్‌ప్రెషర్."

"అసలెట్లా జరిగింది?"

"పన్నెండు గంటలాటకి మావాళ్ళు సినిమా కెళ్ళారు. నేనాఫీసుకెళ్ళాను. వాళ్ళింటికి వచ్చేటప్పటికి తాళం పగలగొట్టి వుంది. ఎదురుగా వున్న గెస్టుగారి పెట్టె పగలగొట్టి నాలుగువేల రూపాయలు తీసుకువెళ్లారు. ఆయన వెళ్ళేటప్పుడు ఇందులో డబ్బుంది నాల్గువేలు జాగ్రత్తఅని చెప్పి వెళ్ళారుగూడా."

"మరి ఈ కుక్కలేం చేస్తున్నాయి."

"ఏమిటోమరి ఆ పెట్టెచుట్టూ తిప్పి వాసన చూపిస్తున్నారు."

పనిమనిషి. చాకలి. పాకీవాడు. పాలవాడు. అందర్నీ వరసగా నిలబెట్టి కుక్కల చేత వాసన చూపిస్తున్నారు. చుట్టూ తిప్పుతున్నారు.

ఇంట్లోవాళ్ళు చాలా గొడవ పడుతున్నారు. వాళ్ళవేమీ పోలేదుట. గెస్టుగారి డబ్బు మాత్రమే పోయిందిట.

"సాయంత్రానికల్లా గెస్టుగారు వస్తారు నా పరువు పోతుంది. నా ముఖమెలా చూపించను. ఆయనేమనుకుంటారు" అని ఆనందరావుగారు చాలా హైరానా పడిపోతున్నారు.

ఇంతలో బయట "పకడో పకడో కుత్తానే పకడ్ లియా" అని పెద్దగా కేకలు. కుక్కలెవరిమీదో దూకుతున్నాయి. పోలీసులామనిషిని పట్టుకుని కొడుతున్నారు. లోపలి వాళ్ళంతరూ "ఆ పకడాగయా" అంటూ బయటి కొచ్చారు.

"స్టాపిట్" అంటూ ఆనందరావుగారు పెద్దగా అరిచారు.

"ఆయనేనండీ మా గెస్టు. పెట్టె వాసన

ఆయన దగ్గరుంది గాబోలు పాపం పిచ్చి కుక్కలు ఆయన్ని పట్టుకున్నాయి" అని ఆనందరావుగారి భార్య నెమ్మదిగా అంది.

—దాసు మధురభారతి

# అనుభవం



రంగ

సరోజ లైటు వేసుకుని ముందు వరండాలో కూర్చుంది. రాజ్యం. గోపాలం 'ఫస్టుషో' సినిమా చూసివచ్చేరు. సరోజను చూస్తూ "ఇంకా నిద్రపోలేదామ్మా?" అన్నాడు మృదువుగా చెల్లెలిని గోపాలం.

"లేదు. అమ్మ 'ఫెయింట్' అయిపోయింది. గ్లూకోజ్ వాటర్ కలిపి యిచ్చేను. ఇప్పటికెలాగో తేరుకుంది. ఇప్పుడిప్పుడే నిద్రలోకి జారింది. అయినా అమ్మ ఆరోగ్యంకంటె మీకు సినిమాలే ముఖ్యం కదా! నేనుండబటి సరిపోయింది కాని" సరోజకంఠంలో అసహనం. నిషూరం కొంచెం తీవ్రంగానే ధ్వనించేయి.

రాజ్యం, గోపాలం మౌనంగా లోపలకు వెళ్ళేరు. తల్లిదగ్గర కాస్సేపు కూర్చున్నారు. ఆవిడ విశ్రాంతిగా నిద్రపోతోందని స్పష్టం అయేక లేచి బట్టలు మార్చుకున్నారు. భోజనాలు ముగించి పడకగదిని చేరేరు.

సరోజ పక్కగదిలోంచి ఏదో గొణుగుతూనే వుంది. రాజ్యానికి లేచివచ్చి పరిస్థితిని అర్థంచేసుకునేటట్లు జవాబు చెప్పాలని వున్నా, గోపాలం చేతుల్లో బందీ అయిన రాజ్యం కదలటానికి వీలులేకపోయింది.

*　　*　　*

సరోజకు పెళ్ళి కుదిరింది. గోపాలం యిచ్చిన కట్నం తీసుకుని వెళ్ళి ప్రకాష్ తన చెల్లెలు సుందరికిచ్చి. పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించివేసేడు. ఊళ్ళోనేవున్న అత్తవారింటికి సుందరి వెళ్ళిన తర్వాతనే సరోజ అత్తవారింటికి వచ్చింది.

ఆరోజు సరోజ, ప్రకాష్‌లు ఆఫీసుల నుంచి పెందరాళే ఇంటికి వచ్చేరు. ఇద్దరూ సినిమా ప్రోగ్రాం వేసుకుని సినిమాకు తయారయ్యేరు.

ఇంతలో "బాబూ! ప్రకాష్?" అంటూ ప్రకాష్ తల్లి పిలిచింది.

"ఎందుకమ్మా?" అంటూ ప్రకాష్ తల్లి గదిలోకి వెళ్ళేడు.

"దగ్గుమందు అయిపోయిందిరా! అది తాగనిదే ఈ రాత్రికి నిద్రపట్టదు. ఆ లలితాదేవి హాస్పిటల్‌కి వెళ్ళి ఆ మందు తెచ్చి పెడతావేమోనని" ఆవిడ సన్నగా మూలుగుతూ చెప్పింది.

"ఎలాగమ్మా? ఆవిడ ఈ పాటికి శాంతి నగర్ బ్రాంచికి వెళ్ళిపోయి వుంటుంది. రేపు ఉదయమేవెళ్ళి తప్పక తీసుకువస్తాను ఇప్పుడు మేము సినిమాకు వెళుతున్నాం. ఈరోజుకి టేబిలెట్ వేసుకుని పడుకోమ్మా" అంటూ ఇవతలకు వచ్చేడు ప్రకాష్.

ప్రకాష్, సరోజ కలసి సినిమాకు వెళ్ళిపోయేరు. ఆ తర్వాత కొద్దిసేపటికి లలితా నగరంనుంచి సుందరి వచ్చింది. వస్తూనే "నీ వంట్లో ఎలా వుందమ్మా? అన్నయ్య ఒదినలు ఇంకా డ్యూటీలనుంచి రాలేదా?" అంటూ ఆత్రుతగా అడిగింది.

"వచ్చేరమ్మా! వచ్చి సినిమాకు వెళ్ళిపోయేరు." ఆవిడ మెల్లగా బదులు చెప్పింది. సుందరి ఆ మాటకు బరువుగా నిట్టూర్చింది. ఆ తర్వాత లోపలకు వెళ్ళి హార్లిక్సు కలిపి తెచ్చి- ముందు టేబ్‌లెట్

# మల్లెపందిరి

## పట్టపు వేశ్య

పట్నపు రాణియే పట్టపురాణి. పట్టం కట్టించుకున్న రాణియే అనుకోండి. అందుచేత రాజుగారి ప్రియ'రాణి'. అలాగే పట్టపు వేశ్య రాజుగారి ప్రియ వేశ్య.

ఒక నూనూగు మీసాల యువకుడు మొదటి ఆట సినిమా చూసి ఆ పెద్దింటికొచ్చి పలకరించాడు. "ఇప్పుడు మా ఇంట్లో ఉండదగిన వేళ కాదు. యజమానిగా రాచ్చే వేళ" అంటోంది:

మార మావస మదీయ మానసే
మాధవైక నిలయే యదృచ్ఛయా।
శ్రీ రమాపతి రిహాగమేదసౌ
కః సహేత నిజ వేశ్మ లంఘనం?॥

(కృష్ణ కర్ణామృతం)

మదనా నా మనస్సులో నిలవకు. ఇది మాధవ నిలయం. గమ్మున ఆ లక్షింపతిగారు వచ్చినా వచ్చెయ్యొచ్చు. తన ఇంట్లో మరొకరు వుండడం ఎవరు సహిస్తారు?

—సౌభరి


# తెల్ల మచ్చల వైద్యం

## వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి



తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగులు నుండి ప్రశంసలు అందినవి. ఇది అంత ప్రశంసలు పొందడానికి కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారిపోవటం మొదలవుతుంది. మరియు క్రమంగా చర్మం యొక్క రంగు వస్తూ ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత అవి ఎంత బాగా తెలిసేస్తుందో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ చెరు బబ్బు నుండి విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారం కోసం ఒక ప్యాకెట్ మందును ఉచితంగా ఇస్తూ ఉన్నాం. మీరు అనేక విధాలుగా నిరాశ చెంది ఉంటారు ఒక్కసారి వాడి చూడండి. ఎక్కడెక్కడ మచ్చలున్నాయో ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలగున వివరాలను వ్రాయండి.

ఈ వైద్యంకోసం మందును ఎవరైనా చేయవచ్చును విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి. BHARAT AYURVEDASHRAM P. O. KATRI SARAI (GAYA)